# క్షణంలో సగం

ప్రెస్ మానేజరు: (ఎడిటర్‌తో) ఇక "విశ్రమించండి".

ఎడిటరు: ఎందుకని? దసరా అయిపోయెగా?

ప్రె. మా: అదికాదండి నే చెప్పొచ్చింది. "భావస్వాతంత్ర్యం మన జన్మహక్కు; దాన్ని రాజ్యాంగం పూర్తిగా భద్రపరచు వరకూ" విశ్రమించ మన్నారుగా! ఇక విశ్రమించ గూడదా అని.

ఎడిటరు: అనుక్కో తీసెయ్యమనా మీరు చెప్పటం? ఏం కారణం?

ప్రె. మా: ప్రెస్ బిల్లు రచనా, ప్రకటన స్వాతంత్ర్యాలనీ ముద్రణా స్వాతంత్రాన్నేగా హద్దుల్లో పెట్టిందీ? భావస్వాతంత్రం గురించి ఆ బిల్లులో ఎక్కడా ఏక్లాజూ లేదయ్యెను. అంటే ఆ స్వాతంత్ర్యం మనకి వున్నట్టే అవుపిస్తోంది. ఔనా?

ఎడిటర్: (ఆలోచించి) అ...వు...ను... మనం ఏమయినా భావించుకోవచ్చు. అంటే అనుకోవచ్చు. ఆ సూక్తిని ఇక వెయ్యాడం అనవసరమే. కాకపోతే వాటిని రాయొద్దన్నారు, అచ్చొత్తటం వద్దన్నారు; అంతేగా?

ప్రె. మా: అంతే, అంతే.

ఎ: (గెంతుతూ గోలగా అరుస్తూ) "మన రాజ్యాంగం మన భావనా స్వాతంత్రాన్ని పూర్తిగా భద్రపరచింది, (ప్రకటించబడి చెడిపోకుండా) ఇక మనం విశ్రమించుదాం" అని మొదటి పేజీలో 'బాక్సు' కట్టించి వేయించండి.

* * *

గీతారావూ మోతారావూ మళ్లీ ఎన్నికల్లో నిలబడ్డానికి అర్హులుగా నిర్ణయించినందుకు అభినందనాలు. (నిర్ణయించింది వాళ్ళే!) వాళ్ళకి నైతికబలం వీశెల లెఖ్ఖనా, సవ్వర్తన మణుగుల లెఖ్ఖనా ఉన్నాయి. పైగా వాళ్ళెప్పుడూ (ప్రస్తుత) యం, యల్. ఏ. లుగా ఉండి ఎట్టి అల్లరిన్నీ చేసివుండలేరు. అర్హతా నర్హతా నిర్ణేతలకు ఈవిషయం ముఖ్యంగా తోచివుంటుంది. వాళ్ళు ప్రస్తుత పార్లమెంటరీ జీవితంలోని నాలుగు యేళ్లలోనూ ఏ శాసనం, ప్రణాళికల పట్లా, అనుకూలంగా గాని, వ్యతిరేకంగా గాని మాట్లాడినపాపాన పోలేరు, ఏ ప్రశ్నా వేసి వుండలేరు. కాకపోతే, పార్లమెంటు సమావేశంలో, "కోరం" సరికట్టడానికి సిద్ధంగా వుంటూవొచ్చారు. తగుమాత్రపు గాలి, వసతు లున్న "లాబీ"లో నిద్రించటానికి యెట్టి సౌకర్యాలున్నదీ, వాటిని ప్రభుత్వం యెలా అభివృద్ధి పరచిందీ, వాళ్ళవల్లే ఇతర్లకి తెలిశాయి. జైహింద్. వాళ్ళు ఇకముందూ పార్లమెంటులో పై కార్యక్రమాలనే క్రమంగా అనుసరించ గలరు. అందరి వోట్లూ వాళ్ళకేనని నమ్మబడుతున్నది.

* * *

సహానం: ఇదేమిటండీ, మీకు "రూరల్" సీటు మార్చి "టౌను" సీటు యిచ్చారు?

మానం: వెనక మనం "రూరల్"కి నిలబడి గెలిచాంగామూ! అందుకు...

స: అయితే యిప్పుడూ అక్కడే యిస్తే బాగుండేదేమో? గెలిచేవారూ?

మా: ఎట్లా బాగుంటుందీ? మనం మళ్ళీ ఆ నియోజక వర్గానికి వెళ్ళడం యిది రెండో సారి అవుతుందండి. ఏంబాగుంటుందిచెప్పండి? అటుపోవటం యిష్టంలేక నేనే కోరానండి "టౌను" ఇవ్వమని.

స: అదాండి! చిత్తం. ప్రచారానికి దానికి "రూరల్ కి" పోతే...

మా: లక్ష యిబ్బందు లొస్తైలెండి.

స: సెలవు.

* * *

కృష్ణా - కుంభకోణం ప్రాజెక్టు వివరాలు ప్రకటిస్తూ వేదాంతరావు తన హర్షాన్ని తెలియజేశారు. ఈ ప్రాజెక్టువల్ల ఆంధ్ర-తమిళులు రాష్ట్రాలు విభజించుకు పోయినా, పరస్పర స్నేహ (కలహా)లతో యెప్పుడూ అన్యోన్యంగానే వుండగలరని వారు ఉద్ఘాటించారు. సరిహద్దు నిర్ణయాలు జరక్కముందే మరికొన్ని ప్రాజెక్టులు నిర్మించాలని వారు ఆశిస్తున్నారు. కూవం-బంగాళా అఖాతం ప్రాజెక్టూ, తెనాలి షరాబు బజార్ వద్ద పాతప్రవాహాన్ని -సద్వినియోగం చేసే ప్రాజెక్టూ యిందులో ఉన్నయో లేవో తెలీలేదు ___"శారద"